## గుంటూరు యార్డులో వినూత్న కార్యక్రమం
# వెయ్యి మంది రైతులకు ఉచిత భోజనవసతి

గుంటూరు, జనవరి 25 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రాలకు పరిమితమైన ఉచిత అన్నదాన కార్యక్రమం గుంటూరు మార్కెట్ వ్యవసాయ కమిటీకి విస్తరించింది. రాష్ట్రంలోనే తొలిసారిగా యార్డుకు వచ్చే రైతులకోసం ఈ వినూత్న కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్లు యార్డు ఛైర్మన్ లేళ్ళ అప్పిరెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పలు పథకాల్లో భాగంగా ఈ 'రాజ'భోజనం ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. నిత్యం వెయ్యి మంది రైతులకు ఉచిత భోజన వసతి కల్పిస్తామన్నారు. యార్డులో మిర్చి విక్రయాలు జరిపే సమయంలో తక్‌పట్టీల ఆధారంగా రైతులకు భోజన టోకన్లు మంజూరు చేస్తారు. అవసరాన్ని బట్టి ఇంకా ఎక్కువమందికి కూడా భోజన వసతి కల్పించేందుకు యార్డు పాలకవర్గం సిద్ధంగా ఉందని అప్పిరెడ్డి పేర్కొన్నారు. ఈ ఉచితన భోజన కార్యక్రమాన్ని పాలకవర్గ కమిటీ సభ్యులు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# వృత్తివిద్యాకోర్సులకు ప్రోత్సాహం కల్పించాలి

దుగ్గిరాల, జనవరి 25 ప్రభాతవార్త: విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగాకళాశాలల్లో వృత్తివిద్యాకోర్సులను ప్రోత్సాహం కల్పించాలని దుగ్గిరాల ఎమ్మెల్యే గుదిబండి వెంకటరెడ్డి కోరారు. స్థానిక డాక్టర్ కె.ఆర్.ఆర్.ఎం.డిగ్రీ కళాశాల 27వ వార్షికోత్సవం శుక్రవారం కళాశాల ఆవరణలో జరిగింది. కళాశాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ కె.రవీంద్రబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధినే ప్రాధాన్యత ఇస్తానని, కళాశాల ప్రహరిగోడ, గ్రౌండ్‌లెవలింగ్‌కు ప్రభుత్వం ద్వారా నిధులు ఇప్పించడానికి కృషి చేస్తామన్నారు. సిండికేట్ బ్యాంక్ మేనేజర్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తెలుగుబాషకనుపాపలాంటిదని, తెలుగుబాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలన్నారు. పద్యరూపంలో ఈమని చేసిన ఉపన్యాసం సభికులను అలరించింది. కళాశాల పూర్వవిద్యార్థి, గ్రూప్–2స్టేట్ టాపర్ ఆర్.వెంకటరమణ నాయక్ మాట్లాడుతూ కష్టపడి చదివినట్లయితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.తుకారామ్‌ప్రసాద్ కళాశాలఅభివృద్ధి, నూతన కోర్సుల గురించి వివరించారు. ప్రిన్సిపాల్ డి.ప్రభాకరరావు, జాతీయ సేవాపథకం ప్రోగ్రామ్‌ఆఫీసర్ డాక్టర్ పి.యశ:పాల ఉన్నారు. పూర్వవిద్యార్థి వెంకటరమణను పూలమాలలతో సన్మానించారు. విద్యార్థులకు మెరిట్ బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అధ్యాపకులు తమ్మా రాఘవరెడ్డి, నటరాజు, తిరుపతయ్య, శివకుమారి, గిరిధర్ పాల్గొన్నారు.

# రక్షితమంచినీరు అందించేందుకు కృషి

చెరువుజమ్ములపాలెం(బాపట్లరూరల్), జనవరి25 ప్రభాతవార్త: మండల పరిధిలోని చెరువుజమ్ములపాలెంలో నాందిఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.11లక్షల



శంకుస్థాపన చేస్తున్న జె.డి శీలం,ఎమ్మెల్యే గాదె, డిసిసి ముప్పలనేని తదితరులు

నిధులతో ఏర్పాటు చేయనున్న రక్షిత మంచినీటి పథకానికి రాజ్యసభసభ్యుడు జె.డి శీలం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ కటికల రాజేష్ అధ్యక్షత వహించారు. జె.డి శీలం, ఎమ్మెల్యే గాదెవెంకటరెడ్డిలు మాట్లాడుతూ గ్రామీణప్రాంత వాసులకు రక్షిత మంచినీరు అందించేందుకు కాంగ్రెస్‌ప్రభుత్వం కృషిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు ముప్పలనేని శేషగిరిరావు, ఎంపిపి దాసరి యోహను, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గనాయకులు చేజర్ల నారాయణరెడ్డి, సలగల రాజశేఖర్, మండలపార్టీ అధ్యక్షులు కోగంటి సత్యప్రసాద్, మండల ఉపాధ్యక్షులు బొడ్డు సుబ్బారెడ్డి, బోగిరి ఆరోను, పులిపాటి విల్సన్, మచ్చా శ్రీనివాసరెడ్డి, నరాలశెట్టి రాంబాబు, పట్టణపార్టీఅధ్యక్షులు అల్లంగోపికృష్ణ, రేగులగడ్డ సజ్జనరావు, దాసి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

# లబ్దిదారులను చైతన్యపర్చాలి

తెనాలిక్రైమ్, జనవరి 25 ప్రభాతవార్త: లబ్ధిదారులను చైతన్యవంతులను చేసి వారిగృహాలు నిర్మించుకునే విధంగా సహకరించాలని తెనాలి ఎంపిపి కేసన కోటేశ్వరరావు సూచించారు. స్థానిక ఎమ్డీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఇందిరమ్మ ఫేజ్–2 సమావేశానికి ఎంపిపి అధ్యక్షత వహించి మాట్లాడారు. సమావేశంలో ఎమ్డీవో విజయలక్ష్మణ్, ఇ.వో.పి.ఆర్.డి రాజారావు, హౌసింగ్ ఎ.ఇ రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఇందిరమ్మ ఫేజ్–2 కార్యక్రమం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కమిషనర్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**దుప్పట్ల పంపిణీ:** స్థానిక మారీసుపేటలోని జీవనజ్యోతి నర్సింగ్ కళాశాలలో శుక్రవారం బుడ్డమ్మాయిమానవత్వ సేవాసమితి ఆధ్వర్యంలో నిరుపేదఅంధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. సమావేశానికి సేవారత్న వేమూరి చెంచయ్య అధ్యక్షత వహించారు. డీన్‌ఆఫ్ దకాలేజి వేమూరి విజయకుమారి, కన్వీనర్ లీవింగ్‌స్టన్, స్వరలయ వేదిక వ్యవస్థాపక, అధ్యక్షుడు లక్కారాజుసాయి, కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ వాదులపై 'చిట్టా' మండిపాటు

సత్తెనపల్లి, జనవరి 25, ప్రభాత వార్త: రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేసి ప్రజల్లో చైతన్యం కల్పించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘనత వై.ఎస్.రాజశేఖరరెడ్డికే దక్కుతుందని, ముఖ్యమంత్రిపై చేస్తున్న ఆరోపణలు సరికాదనితెలంగాణ కాంగ్రెస్ వాదులపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిట్టా విజయభాస్కరరెడ్డి మండిపడ్డారు. శుక్రవారం సత్తెనపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయనఆవేశంగా మాట్లాడారు. కొంతమంది తెలం గాణ ప్రాంతానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులుచేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ప్రజాసమస్యలను తెలుసు కునేందుకు పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసి ప్రభుత్వాన్నిఏర్పాటు చేసి ప్రజాసమస్యల పరిష్కారంలో నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డిపై కాంగ్రెస్ అధిష్టానానికి లేనిపోని అసత్య ఆరోపణలు చెప్పటం సమంజసం కాదన్నారు. ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన కమిటీలను ఏర్పాటు చేసి 2008–09 బడ్జెట్‌లో నిధులను కేటాయించబోవటం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. గతంలో ఏ ముఖ్యమంత్రి తలపెట్టని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి జలయజ్ఞాన్ని ప్రారంభించి రైతుల హృదయాల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించి, పేదలకు ఇప్పటి వరకు సుమారు 5లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారన్నారు. తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలను ప్రవేశపెట్టడం, 610 జి.ఓ.ను అమలు చేసింది ముఖ్యమంత్రి కాదా అని సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో ఇంతటి ప్రజాదరణ పొందిన నాయకుడు మరొకరు లేరని, అటువంటిది కాంగ్రెస్ పార్టీలో కురువృద్ధులుగా ఉంటున్న తెలంగాణ ప్రాంతానికి చెందిన సీనియర్ నాయకులు అసత్య ఆరోపణలు చేయటం సరికాదన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేసే అధికారం అధిష్టానానికే ఉందని, ముఖ్యమంత్రి చేతుల్లో లేదన్నారు. మరో 20 సంవత్సరాల వరకు కాంగ్రెస్ పార్టీలో ఆంధ్రప్రదేశ్ పరిధిలో రాజశేఖరరెడ్డే హీరో అని అభివర్ణించారు. దేశం పార్టీతోపాటు, టి.ఆర్.ఎస్. నాయకులు చేస్తున్న ఆరోపణలు ఖండించాల్సింది పోయి సొంత పార్టీలోనే వేరే కుంపటి పెట్టినట్లుగా మాట్లాడటం ఎంతో అనుభవం ఉన్న నాయకులకు తగదన్నారు. తెలంగాణ ప్రాంతం నుండి కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా విమర్శలను మానుకోవాలని,లేకుంటే ఆంధ్ర ప్రాంతం నుండి పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని హెచ్చరించారు.కార్యక్రమంలో పట్టణపార్టీ అధ్యక్షులు వెలుగూరి శరత్ బాబు, సీనియర్ నాయకులు కంబాల వెంకటేశ్వరరావు,మాజీ డి.సి.సి. కార్యదర్శి షేక్ చాన్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ అబ్దుల్ జానీ, నాయకులు కోడిరెక్కదేవదాసు, తుమ్మల వెంకటేశ్వరరావు,జలీల్, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు పౌల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నిందితులకు డార్మెటరీ

గుంటూరు, జనవరి 25 ప్రభాతార్త: హత్యాయత్నం కేసు నిందితులకు శుక్రవారం పోలీసు కార్యాలయంలో డార్కెటరీ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలుస్తోంది. రేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో కె.విజయకుమార్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితులకు ఈ కౌన్సిలింగ్ నిర్వహించినట్లు సమాచారం. హత్య, హత్యాయత్నం కేసుల్లో నిందితులకు ఈ తరహా కౌన్సిలింగ్ నిర్వహిస్తే నేరాల రేటు తగ్గుముఖం పట్టవచ్చనేది అధికారుల అభిప్రాయంగా చెబుతున్నారు. గతంలో పల్నాడు ఫ్యాక్షనిస్టులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తే సత్ఫలితాలు రావడంతో మేజర్ కేసుల్లో నిందితులకు కూడా డార్కెటరీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ మహేష్‌చంద్ర లడ్హా ఆధ్వర్యంలోఅధికారులు, సిబ్బంది ఇటీవల పలు కేసులను చేధించడం వెనుక డార్మెటరీ కౌన్సిలింగ్ ద్వారా సమాచారం వచ్చినట్లు తెలుస్తోంది. కౌన్సిలింగ్‌కు భయపడిన కొంతమంది నిందితులు కీలక సమాచారం ఇస్తుండడం ద్వారా కేసుల మిస్టరీని బట్టబయలు చేస్తున్నారు. సంచల కేసుల్లో నిందితులు చిక్కితే వారి డార్మెటరీ తప్పదని కొంతమంది పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

తెనాలిక్రైమ్, జనవరి 25 ప్రభాత వార్త: రూరల్ మండలం అంగలకుదురు వద్ద గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కోలా ప్రదీప్ వర్మ సర్వశిక్షాఅభియాన్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన మద్దులూరి రమణమ్మకూడా ఆదేశాఖలో పనిచేస్తున్నారని, అంతేగాక స్వచ్ఛంధ సంస్థ రాశిలో కూడా వీరు పనిచేస్తున్నారని పోలీసులు చెప్పారు. గురువారం విజయవాడ వెళ్లి తిరిగి గుంటూరు మీదుగా తెనాలి వస్తూ అంగలకుదురు వద్ద రోడ్డుప్రమాదానికి గురయ్యారని తెలిపారు. ప్రదీప్ వర్మ మృతిచెందగా, రమణమ్మ తీవ్రగాయాలతో తెనాలిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతుంది. శుక్రవారం ప్రదీప్‌వర్మ, ఐడియా సంస్థలో పనిచేసే శివకుమార్ మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# నేటి నుంచి రిటైర్డ్ ఐఎఎస్ రోశయ్య పాదయాత్ర
## + 1700 కిలోమీటర్లు + 130 రోజుల పయనం

సత్తెనపల్లి, జనవరి 25, ప్రభాత వార్త: రిటైర్డు ఐ.ఎ. ఎస్. అధికారి రోశయ్య నేటి నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నారు. ఎస్సీ,ఎస్టీ, బిసి,ముస్లిం మైనా ర్టీలతోపాటు కాపులకు రాజ్యాధికారం కావాలనే సంకల్పంతో ప్రజలను చైతన్య పరిచి సమస్యలను తెలుసుకునేందుకు ఈనెల 26న మేడికొండూరు మండలం సిరిపురం గ్రామం నుండి పాదయాత్రను ప్రారంభిస్తారు. సిరిపురం నుండి అమలాపురం వరకు ఐదు జిల్లాలను కలుపుకుని చేసుకునే పాదయాత్రలకు అనూహ్య స్పందన వస్తుందని కాపునాడు రాష్ట్ర పొలిటికల్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పి.ఎల్.వి.ప్రసాదరావు సత్తెనపల్లిలో విలేకరులకు తెలిపారు. ఐ.ఎ.ఎస్.అధికారిగా ఎంతో అనుభవం గడించిన రోశయ్య ప్రజల కోసం అమలు చేసేప్రణాళిక ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. జనాభా ప్రాతిపదికన సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని అసెంబ్లీ, పార్లమెంటు సీట్లనుకేటాయించాలని, మహిళలకు ప్రాతినిథ్యంకల్పించాలని తదితర డిమాండ్స్‌తోఈ పాదయాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు 20 కిలోమీటర్లు చొప్పున పాదయాత్ర జరుగుతుందని, గుంటూరు, ప్రకాశం, కృష్ణా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల్లోపర్యటిస్తామని, ఆయా జిల్లాల్లో ఉన్న గ్రామ స్తులను పూర్తిస్థాయిలో చైతన్య పరిచి గతంలో లేని విధంగా కొత్త ఒరవడిని సృష్టిస్తామన్నారు. 2004 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్య మంత్రి పాదయాత్ర నిర్వహించారని, దానికిధీటుగా రెట్టింపుస్థాయిలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని పాదయాత్రను నిర్వహిస్తామన్నారు.ప్రజలు దీనిని పూర్తిస్థాయిలో అండదండలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో పాదయాత్ర నిర్వాహక కమిటీసభ్యులు గుర్రాల ఉమామహేశ్వరరావు, జె.శివకుమార్, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# 'వార్త', 'గ్లోబల్' 'రోటరీ' ఉచిత వైద్యశిబిరం



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న గ్లోబల్ హెల్పింగ్ హ్యాండ్స్ వైద్యులు



విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ

బాపట్లటౌన్, జనవరి25ప్రభాతవార్త: డాక్టర్ల సలహాల మేరకు మందులను వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మునిపల్ కమీషనర్ సబ్బ శివరామకృష్ణ అన్నారు. స్దానిక అక్బర్‌పేటలో గల ఎపిఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్ ఆవరణలో 'వార్త', 'గ్లోబల్' 'రోటరీ'ల ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా కమీషనర్ శివరామకృష్ణ మాట్లాడుతూ 'వార్త','గ్లోబల్' 'రోటరీ' సంస్దలు సంయుక్తంగా ఉచితవైద్యశిబిరాన్ని నిర్వహించటం హర్షించదగ్గవిషయమని కొనియాడారు.

విద్యార్థులు విద్యతోపాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలని ఆయన సూచించారు. గ్లోబల్‌హెల్పింగ్ హ్యాండ్స్ కోఆర్డినేటర్ కె. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యసేవలు అందిం చేందుకు కృషి చేస్తున్నామని, వైద్యపరంగా పేదలకు ఆదుకోవటమే మాలక్ష్యమన్నారు. ఈ సందర్బంగా సుమారు 530మంది పిల్లలకు బలహీనత, కళ్ళు మరియు జనరల్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్బంగా మున్సిపల్ కమీషనర్ శివరామకృష్ణ పిల్లల ఆరోగ్యపరిస్థితిని గ్లోబల్‌హెల్పింగ్ హ్యాండ్స్ కోఆర్డినేటర్ కె. ఉదయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ టి.ఇ భరత్‌రాజ్, డా॥ ఎన్.శ్రీనివా సాచార్యులు, రోటరీ సభ్యులు హరినాథ గుప్తా, బి.శివరామకృష్ణ, మరియు గ్లోబల్‌హెల్పింగ్ హ్యాండ్స్ వైద్యులు డా॥ జైనభా, డా॥ ప్రసన్నకుమార్, డా॥రమేష్, లూసీ జేవియర్, ఎలీసా, సంధ్యా,యోనా విజయకు మారి, సత్యం, రత్నకిషోర్ తదితరులు పాల్గొన్నారు.